ప్రజాశక్తి

గురువారం 8 మే 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

కార్మికులను బానిసలుగా చేసే

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

- 20న సమ్మెను జయప్రదం చేయాలి
- కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి నాయకుల పిలుపు

ప్రజాశక్తి-బాపట్ల

కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కోసం ఈ నెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి సదస్సు జరిగింది. సదస్సుకు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్, ఎఐటియుసి జిల్లా నాయకులు సింగం వాణిశ్రీ, ఐఎఫ్టియు నాయకులు ఎస్డి హాపీ అధ్యక్షత వహించారు. సదస్సులో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్యామేలు, ఐఎఫ్టియు నాయకులు మేకల ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో కార్మికవర్గం కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఉమ్మడిగా తిప్పికొట్టాలన్నారు. జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాన్ని రద్దు చేయాలని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. మే 20న జరిగే సమ్మెలో కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. మజుందర్, ఎఐటి యుసి జిల్లా ఉపాధ్యక్షులు సింగరకొండ, ఐఎఫ్టీయూ కేంద్ర కార్మిక సంఘాలు ఉమ్మడి నాయకులు శరత్‌బాబు, లక్ష్మణ్, వసంతరావు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాకు

మరో జాతీయ రహదారి

- నిజాంపట్నం హార్బర్ నుంచి
- అమరావతికి గ్రీన్‌ఫీల్డ్ హైవే



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం హార్బర్ నుంచి రాజధాని అమరావతికి నాలుగు లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరైంది. ఇప్పటికే చీరాల వాడరేవు నుంచి పర్చూరు, చిలకలూరిపేట, పిడుగురాళ్ల మీదుగా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు అనుసంధానం చేస్తూ.. 167ఎ జాతీయ రహదారి నిర్మాణంలో ఉండగా జిల్లాలోని నిజాంపట్నం హార్బర్ నుంచి అమరావతి ఔటర్‌రింగ్ వరకు మరో గ్రీన్ ఫీల్డ్ హైవే రానుంది.

రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్లు, నౌకాశ్రయాలను జాతీయ రహదారులతో అనుసంధానించే ప్రాజెక్టులను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి చందోలు, నారాకోడూరు మీదుగా గుంటూరు శివారులో ఉన్న బుడంపాడు వద్ద కోల్‌కతా- చెన్నై జాతీయ రహదారి వరకు మొత్తం 53 కి.మీ. మేర నూతనంగా నాలుగు లైన్ల రహదారి కోసం సంబంధిత అధికారులు ముందుగా ప్రతిపాదనలు చేశారు. కానీ ఆ తరువాత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు హార్బర్ నుంచి జాతీయ రహదారికి కలపడమే తమ లక్ష్యమని పేర్కొంటూ.. దీన్ని కత్తిపూడి- ఒంగోలు 216 జాతీయ రహదారిలోని చందోలు వరకు 18 కి.మీ. మేర నూతన రోడ్డు నిర్మిస్తే చాలని సూచించారు. ఇలా రహదారిని కుదించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని భావించిన జిల్లా ప్రజాప్రతినిధులు రాజధాని అమరావతి సదరు జాతీయ రహదారి నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కేంద్ర మంత్రులతో అనేక దఫాలుగా చర్చించి వారిని ఒప్పించి.. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు కషి చేశారు. ఈ నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం జరిగితే బాపట్ల సూర్యలంక బీచ్‌కు, చీరాల బీచ్‌తో పాటు అనేక ఆధ్యాత్మిక ప్రదేశాల అనుసంధానంతో పర్యటకాభివద్ధి చెందుతుందని తెలిపారు. ఈ రహదారి వల్ల విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్‌కు మంచి కనెక్టివిటీ ఏర్పడుతుందని వివరించారు. దీంతో పాటు నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ కు ఎక్కడా అవరోధం లేకుండా రోడ్డు ఏర్పడటం వల్ల మరింత ఆర్థికాభివద్ధి బలోపేతం అవుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో

▶ 2లో



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

మన్యం వీరుడి స్ఫూర్తితో ముందుకు..

'అల్లూరి'కి ఘన నివాళి

▲ 8పేజీ

పురుగు మందు డబ్బాలు తెచ్చుకొని ధర్నా చేస్తున్న బాధితులు

మాక్‌డ్రిల్‌లో భాగంగా క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు

సన్నద్ధం

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్‌అన్సారియా పేర్కొన్నారు. సంఘ విద్రోహ చర్యలు నిర్వీర్యం చేయటం, సమాజంలో శాంతి భద్రతలు పరిరక్షణ, పౌరులకు భద్రతా భావాన్ని కల్పించే చర్యల్లో

▶ 2లో

రైల్వేస్టేషన్‌లో అనుమానిత బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న బాంబ్‌స్క్వాడ్

మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

మా భూమి అప్పగించకుంటే ఆత్మహత్యే..!

- పురుగు మందు డబ్బాలతో ఆందోళన
- సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం

తమ భూమి తమకు అప్పగించకుంటే ఆత్మహత్యే శరణ్యమని మార్కాపురం మండలం, బోడపాడు గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులంతా పురుగుమందు డబ్బాలు చేతబట్టి మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. పలుమార్లు మా భూమి ఆక్రమించుకున్నారని, తమ భూమిని తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరినా ఫలితం లేకపోవడంతో చావోరేవో తేల్చుకునేందుకు సిద్ధమయ్యామని బాధితులు పోరెడ్డి నాగమ్మ, అల్లూరమ్మ, శివారెడ్డి, లక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు వాపోయారు. తమకు ఆ భూమి మాత్రమే జీవనాధారమని, ఆ భూమి దక్కకపోతే చావు తప్ప మరో మార్గం లేదని ఆందోళనకు దిగారు. బోడపాడు గ్రామ సమీపాన గల పెద్ద యాచవరం ఇలాఖాలో సర్వే నెంబరు 3/5లో ఎ॥ 2.22 సెం॥ భూమి తమదేనని బాధితులు చెబుతున్నారు. ఆ భూమిని బోడపాడు గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తమపై దాడి చేస్తున్నారన్నారు. ఈ భూమికి సంబంధించిన హక్కులు తమ పూర్వీకులకు ఉన్నాయన్నారు. ఆ భూమికి వారసులుగా ఐదుగురు అన్నదమ్ములం ఉన్నామని చెప్పారు. అందులో సమాన భాగాలు రావాల్సి ఉందన్నారు. వైసిపికి చెందిన ప్రజాప్రతినిధి పలుకుబడితో ఆయన మామ పేరుతో ఆ భూమిని ఆన్‌లైన్ చేసుకోవడం జరిగిందన్నారు. మరోసారి అదే భూమిని ప్రజాప్రతినిధి భార్య పేరుతో ఆన్‌లైన్ మార్చడం జరిగిందన్నారు. ఈ భూమి విషయంలో రెవెన్యూ అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి బాధితులు సిద్ధం కావడంతో సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్ స్పందించారు. బోడపాడు బాధితులుగా చెబుతున్న ఆరోపణలపై

▶ 2లో

కార్మికులకు చట్టాలపై అవగాహన

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి -కనిగిరి

మేడే వారోత్సవాల్లో భాగంగా బుధవారం కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి బి. రూపశ్రీ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని పివిఆర్ పార్క్‌లో అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సయ్యద్ షాహిద్ మాట్లాడుతూ వేతన సవరణ చట్టం, హక్కులు, బాధ్యతల గురించి తెలియజేశారు.జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చునని సూచించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కార్మిక శాఖ సహకారంతో వివిధ ప్రభుత్వ శాఖలు, గుడ్ హెల్ప్, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులకు వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్మిక శాఖ అధికారి సుబ్బారాయుడు కార్మిక శాఖలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల గుమస్తాల సంఘం అధ్యక్షులు సయ్యద్ యాసిన్,పోలీస్ బాలకృష్ణ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మా భూమి అప్పగించకుంటే ఆత్మహత్యే.!

(మొదటిపేజీ తరువాయి)

విచారించాలని తహశీల్దార్ కె.చిరంజీవిని ఆదేశించారు. తహశీల్దార్ సంఘటనాస్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. విచారణ చేపడతామన్నారు. మీకు నిజంగా ఆ భూమిలో వాటా ఉంటే మాత్రం తప్పక న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. అనంతరం వారివద్ద ఉన్న పురుగు మందు డబ్బాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు సన్నద్ధం

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు పోలీసులు బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఒంగోలు రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, జిల్లాలోని పలు ప్రదేశాలలో పేలుళ్ళు, ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, పేలుడు పదార్థాల అనుమానాస్పదమైన బ్యాగు ఉంచిన ప్రదేశాన్ని గుర్తించటం, ఆ ప్రదేశంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలు, సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏమి చేయాలి. రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలపై స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది సివిల్ మాక్ డ్రిల్ చేపట్టారు. అలాంటి పరిస్థితుల్లో ప్రజలు భద్రతా పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆ ప్రదేశానికి ఎవరూ వెళ్లకుండా పౌరులు బాధ్యతగా వ్యవహరించటం, పోలీసులు చేసే విధివిధానాలు క్షుణ్ణంగా ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా బ్యాగు ఉన్నట్లు వచ్చిన సమాచారంపై వెంటనే పోలీసులు బీడీ టీం, స్పెషల్ పార్టీ సిబ్బంది, డాగ్స్ స్క్వాడ్‌తో సంఘటనా ప్రదేశానికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. స్పెషల్ పార్టీ, బీటీ టీం సిబ్బంది రైల్వే స్టేషన్, ఆర్టీసి బస్టాండ్ చుట్టుపక్కల క్షుణ్ణంగా పరిశీలించి అనుమానాస్పద బ్యాగ్‌ను గుర్తించారు. ఆ బ్యాగులో పేలుడు పదార్థాలు ఉన్నట్లుగా స్నాపర్ డాగ్ గుర్తించింది. ప్రజలు ఆ ప్రదేశానికి ఎవరినీ వెళ్లకుండా క్యూ మేనేజర్ ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బంది బాంబు డిస్పోజల్ సూట్ ధరించి పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశారు. అనంతరం కలెక్టర్ తమీమ్అన్సారియా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కీలకమైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఉన్న 244 జిల్లాలను భద్రతాపరంగా ప్రత్యేకంగా గుర్తించి మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లాను ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. కీలక ప్రభుత్వ సంస్థలు ఉన్న అన్ని ప్రదేశాలలోనూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశించటంతో ఒంగోలు రైల్వే స్టేషన్, బస్సు స్టేషన్‌లలో ఈ మాక్ డ్రిల్స్ నిర్వహించామన్నారు. నిజంగా ఉపద్రవం సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలి? వివిధ శాఖల సన్నద్ధత- సమన్వయ లోపాలను తెలుసుకోవడం, ఇలాంటి సమయాలలో ఎలా వ్యవహరించాలో ప్రజలకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఎలాంటి పరిస్థితినైనా సమర్ధవంతంగా ఎదుర్కొంటామని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందన్నారు.

ప్రజలలో అవగాహనకే మాక్ డ్రిల్
జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్

విపత్కర పరిస్థితులలో ప్రజలు ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలనే విషయమై అవగాహన కల్పించేందుకు మాల్ డ్రిల్ చేపట్టినట్లు జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ తెలిపారు. ఏదైనా ప్రదేశంలో సంఘ విద్రోహశక్తులు దాడులు చేస్తే అన్ని శాఖలు సంయుక్తంగా విధులు నిర్వహించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు రైల్వే స్టేషన్, ఆర్టీసి బస్టాండ్‌లతో పాటు టంగుటూరు పరిసర ప్రాంతాలలో పెట్రోలియం సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ఆస్తులు ఉండటంతో వాటి భద్రతపై ప్రత్యేక దష్టి సారించామన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దన్నారు. డెమో డ్రిల్ ద్వారా భవిష్యత్తులో సంభవించే అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండటం, ఏమైనా అనుమానాస్పదంగా బ్యాగులు, వ్యక్తులు, ఇతర వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ, అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కెవి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు వన్ టౌన్, టుటౌన్ సిఐలు నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, సింగరాయకొండ సిఐ హాజరత్తయ్య, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సైలు, ఇతర శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అవకాశం

డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

ఎంఎస్ఎమ్ఇ పార్కుకు శంకుస్థాపన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి-పీసీపల్లి

చిన్న, మధ్య తరహా మధ్యతర పరిశ్రమలు పెట్టుకునేందుకు ఓ మంచి సాదవకాశం అని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని లింగన్నపాలెం పంచాయతీల్లో నిమ్జ్ ఆవరణలో ఏడు కోట్లతో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని, అందులో భాగంగా ఇలాంటి పార్కులను ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించారన్నారు. అందులో భాగంగా కనిగిరి నియోజకవర్గంలో మొదటగా పిసిపల్లి మండలంలో పార్క్ ఏర్పాటుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించారని తెలిపారు. 7 కోట్లతో 20 ఎకరాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ ,విద్యుత్ సౌకర్యం, లాంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అందువలన ఎవరైనా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తే, ప్రభుత్వం రాయితీలు కూడా అందిస్తుందన్నారు. భవిష్యత్ తరాలు అభివృద్ధికి ఈ పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఏపిఐఐసి సంస్థ ద్వారా ఈ పార్కును ఏర్పాటు చేశారన్నారన్నారు. మండల ప్రజలతో పాటు కనిగిరి నియోజకవర్గంలో ఎవరైనా సరే ఈ పార్క్ ప్రాంతంలో పరిశ్రమలు పెట్టేందుకు ఆసక్తి ఉన్నవారు ముందుకు రావాలన్నారు. ఇందుకు ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తుందని తెలిపారు. ఇక్కడ తయారైన వస్తువులను పట్నం పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ జోనల్ మేనేజర్ మదన్ మోహన్, డిప్యూటీ జోనల్ మేనేజర్ స్వర్ణలత, ప్రాజెక్ట్ ఇంజనీర్ మహేంద్ర, తహశీల్దార్ సిహెచ్ ఉష, ఎంపీడీవో ఓ.ప్రభాకర్ శర్మ, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి డి.నాగమల్లేశ్వరి, వీఆర్వో రఫీ అహ్మద్, కే.మాల్యాద్రి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వేమూరి రామయ్య, జనసేన సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు, మాదాసు రమేష్ బాబు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాకు మరో జాతీయ రహదారి

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లో గుంటూరు, బాపట్ల జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశం జరిగింది. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నుండి నిజాంపట్నం హార్బర్ వరకు క్రొత్తగా (గ్రీన్ ఫీల్డ్) నాలుగు లైన్ల 47.848 కి.మీ.ల రోడ్డు నిర్మాణంపై స్టేక్ హోల్డర్స్‌తో కలసి సమీక్ష చేశారు. రోడ్డు నిర్మాణ పనులకు అన్ని అనుమతులు పొందిన తరువాత ఆరు మాసాల్లోపు భూ సేకరణ పనులు పూర్తి చేయాలని, అలాగే 18 మాసాల్లోపు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టులో స్టేక్ హోల్డర్స్ అయిన ఆర్ అండ్‌బి, విద్యుత్ శాఖ, ఇరిగేషన్, రైల్వే, ఫిషరీస్, అగ్రికల్చర్, పంచాయితీ రాజ్, దేవాదాయ శాఖ, అటవీ శాఖ అధికారులు వారి వారి శాఖలకు సంబంధించి అంశాలు పూర్తి వివరాలతో శుక్రవారం సాయంత్రం లోపు నివేదిక ఇవ్వనున్నారు. ఈ మేరకు వారు అందించిన వివరాలను క్రోడీకరించి ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేసి ఢిల్లీలోని నేషనల్ హైవే అథారిటీ వారికి పంపి అనుమతులు కోరడం జరుగుతోంది.

9న ధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-సిఎస్.పురం

ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో 9వ తేదీన జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ సిఎస్.పురం మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జెఎస్.ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ కోరారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు ఉండే విధంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలు లేదా బేసిక్ ప్రైమరీ స్కూల్స్ మాత్రమే ఉండాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లును కొనసాగించాలని, సిఎస్.పురం మండలంలోని అన్ని యూపీ స్కూల్స్ కొనసాగించాలని తదితర డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పేరుమార్పు / సవరణ

నేను పంగులూరి అనూష W/o పంగులూరి మహేష్‌చంద్, నివాసం : డోర్ నెం. 4-30, అప్పికట్ల, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్.
ప్రస్తుత పాస్‌పోర్టులో నా పేరు పంగులూరి అనూష, W/o. పంగులూరి మహేష్‌చంద్ అని నమోదు కాబడినది. నా భర్తతో విడాకులు అయిన పిదప నా పేరును నా పుట్టింటి పేరుకు అనగా **(కుర్రా అనూష, D/o కుర్రా వేణుగోపాలరావు KURRA ANUSHA D/o KURRA VENU-GOPALA RAO)** కు మార్చుకోవటం జరిగినది. నేటి నుండి నా పేరును **KURRA ANUSHA, D/o KURRA VENU-GOPALA RAO** గా పిలవబడును. పాస్‌పోర్టు నెం. **Y6351632** లో మరియు భవిష్యత్ సవరణలకు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 187/2024

షేక్ మదార్ వలి .. వాది

వర్సస్

రేపల్లె సరస్వతి మరియు ఇతరులు .. ప్రతివాదులు

To,
1.రేపల్లె సరస్వతి భర్త తిరుపతిరావు అలియాస్ తిరుపాల్ రావు
2. రేపల్లె తిరుపతిరావు అలియాస్ తిరుపాల్ రావుతండ్రి వెంకటయ్య
3. రేపల్లె రాజేశ్వర రావు తండ్రి వెంకటయ్య
రేపల్లె లక్ష్మి భర్త రాజేశ్వర రావు
నివాసం : కొమరోలు గ్రామం
కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా:

వాది మీ పై కోర్టు నందు O.S. 187/2024 అను దావా దాఖలు చేసి ఉన్నందున ఆ దావాలో మీకు శ్రీకోర్టు వారు ఎన్ని పద్యాయములు నోటీసులు పంపినను మీకు చేరనందున మీ హాజరు నిమిత్తం కోర్టు వారు తేది: 14-05-2025 వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా లాయరు గారి ద్వారా గాని శ్రీకోర్టు వారి ముందు హాజరై పై దావాలో మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ: 14-05-2025

ఇట్లు
శ్రీ M.ప్రభాకర్ రెడ్డి, న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. **9948822599**

జనరల్ నోటీసు
మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో

GW.O.P.No.8/2025

తాతా ప్రశాంత్ కుమార్ మరియు ఇంకొకరు .....పిటీషనర్లు

వర్సెస్

తాతా వెంకటేశ్వర్లు మరియు ఇంకొకరు ... రెస్పాండెంట్లు

పై నెంబరు కేసులో తాతా అధ్వయిత్(మైనర్)కు తన తల్లిదండ్రులైన తాతా ప్రశాంత్ కుమార్. వెంకట సుధా శ్రావణిలు మైనరు పేరుమీద షెడ్యూలు ఆస్తిని ఇతరులకు లీజుకు ఇచ్చుటకు పర్మిషను కొరకు కోర్టులో పై కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసు తేది:25-06-2025న పై తెలిపిన కోర్టులో వాయిదా ఉన్నది. ఆక్షేపణ దారులు ఉన్న యెడల తేది:25-06-2025, ఉదయం గం.10.30ని.లకు కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపు కోవలసినది. లేనియెడల అక్షేపణలు లేవని భావించి కోర్టువారు తీర్పు చెప్పెదరని ఇందుమూలంగా యావన్మందికి కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తెలియపరచటమైనది.

షెడ్యూలు :

ప్రకాశం జిల్లా : ఒంగోలు సబ్ రిజిస్ట్రేషను ఒంగోలు మున్సిపల్ కార్పోరేషను ముక్తినూతలపాడు గ్రామం - సర్వే నెం.198/3ఎ సబ్ డివైడెడ్ సర్వే, నెం. 198/3ఎ2 - 2080.8 చదరపు అడుగులు లేక 28 గదులు లేక 231.2/9 చదరపు గజాలులేక 193.30 చదరపు మీటర్లకు హద్దులు :-
తూర్పు : మున్సిపల్ రోడ్డు,ఈ దిశ 72 అ.లు
దక్షిణం : గుడివాడ హనుమంతరావు కుమార్తె లావణ్య గారి స్తలము ఈ దిశ 72 అడుగులు.
పడమర : తాతా విశాలాక్షి గారి స్తలము ఈ దిశ 42 అడుగుల 4 అంగుళాలు
ఉత్తరం :కోట వెంకట నారాయణ గారు అమ్మినస్తలము
ఒంగోలు,
తేది : 05-05-2025 ఇట్లు
పంగులూరి గోవిందయ్య,
వాది తరపున న్యాయవాది,
ఒంగోలు

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No:127/2024

1.కుర్రా వెంకటేశ్వర్లు మరియువగైరాలు... వాదులు

వర్సెస్

1. మలరాజు పుల్లమ్మ మరియు వగైరాలు ... ప్రతివాదులు

To,
D11) చెన్నంరాజు నాగరాజు
@ వెంకమ్ రాజు నాగరాజు,
తండ్రి వెంకమ్ రాజు.
D12) వల్లభరాజు సీతారావమ్మ,
తల్లి రెడ్డిచర్ల తిరుపతమ్మ.
D14) బాలరాజు పుష్ప,
భర్త యేసు రాజు.
D15) బాలరాజు నాగరాజు,
తండ్రి యేసు రాజు.
D11 నుండి **D15** వరకు అందరూ తంగెళ్ళ గ్రామం మరిపూడి మండలం ప్రకాశం జిల్లా.
D18) కుర్రా మల్లికార్జున తండ్రి నరసయ్య.
D19) కుర్రా అరుణ, తండ్రి నరసయ్య.
D20) కుర్రా పద్మ, తండ్రి నరసయ్య.
D18 నుండి **D20** వరకు అందరూ రాజుపాలెం మజారా, మర్రిపూడి మండలం, ప్రకాశం జిల్లా.

దావా సమను

పై నెంబరు వాదులు మీపై భాగ పంపిణీ దావాను దాఖలు చేయగా మీహాజరు నిమిత్తము వాయిదా తేదీ:13-05-2025నకు కలదు. ఆరోజున మీరు స్వయంగా గాని లేదా ప్లీడర్ గారి ద్వారా గాని ఉదయం గం.10: 30 నిమిషాలకు పై వారి కోర్టులో హాజరై మీఆక్షేపణలను తెలుపుకొనవలయును. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున తీర్మానించబడునని తెలుసుకొనవలెను.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా
తేదీ:13-05-2025.
పొదిలి ఇట్లు
తాటికొండ రామ మోహన్‌రావు,బి.ఏ.బి.ఎల్.,
అడ్వకేట్, పొదిలి.
సెల్ :**9885636729.**

హాస్టల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ఇంటర్, పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా పురస్కారాలు అందజేసింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చేతుల మీదుగా విద్యార్థులకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. పదవ తరగతిలో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించిన (580 మార్కులు) పిసిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌కు చెందిన గుత్తికంటి సుదర్శన్ చరణ్, 8వ ర్యాంకు సాధించిన మార్కాపురం బాలికల హాస్టల్ విద్యార్థిని బి.మహాలక్ష్మి (578 మార్కులు), 9వర్యాంకు సాధించిన పిసిపల్లి హాస్టల్ విద్యార్థి మోనిత్(577 మార్కులు), పదో ర్యాంకు సాధించిన పి.

పురస్కారం అందుకుంటున్న హాస్టల్ వార్డెన్ ఆంజనేయరెడ్డి

తిరుపతిరావు(575 మార్కులు)కు అవార్డులు అందజేసి అభినందించారు. అదేవిధంగా గిద్దలూరు మండలం ముడ్డపాడు సంక్షేమ హాస్టల్ నూరు శాతం ఉత్తీర్ణత, 17 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు పొందినందుకు ఆ వసతి గృహ సంక్షేమాధికారి బి.ఆంజనేయ రెడ్డి ఉత్తమ వసతి గృహ సంక్షేమాధికారిగా అవార్డు అందజేసి సత్కరించారు. ఇంటర్‌లో 961 మార్కులతో ప్రకాశం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన యర్రగొండపాలెం సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం విద్యార్థిని ఎం.నవ్యబాయి, 929 మార్కులు సాధించిన కంభం సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహం విద్యార్థి బబిడి పాటినీస్, 914 మార్కులు సాధించిన వలపర్ల అగస్టీన్‌కు అవార్డులు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. లక్ష్మా నాయక్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేలా నిరంతరం ప్రోత్సహించిన అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు అభినందనలు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తికి గాయాలు య్యాయి.ఈ ఘటన మండల పరిధిలోని పి.గుడిపాడు సమీపంలోని గుమ్మళంపాడు గ్రామం వెళ్లే ఎన్ఎస్‌పి కాలువ సమీపంలోని పొలాల్లో ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. అడవిపందుల వేటకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి చీమకుర్తి మండలం మువ్వవారిపాలెం గ్రామానికి చెందిన మానికల వెంకటేశ్వర్లు(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మతి చెందాడు. అదే గ్రామానికి చెందిన కత్తి దుర్గారావు (35) గాయాలతో ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. వెంకటేశ్వర్లు, దుర్గారావు సుబాబుల్ కోతకు అడ్డదారిలో వెళుతుండగా సుబాబుల్ తోటల్లో అడవి పందులు పట్టుకునేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి ప్రమాదానికి గురయ్యారు. హెడ్ కానిస్టేబుల్ సిహెచ్.ఉదయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని బొట్లపాలెం, తూర్పుచౌటపాలెం గ్రామాలలో బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జరిగాయి. ఈ సందర్భంగా దర్శిలో గ్రామోత్సవం నిర్వహించారు. అందులో టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎఎంసి చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు పాల్గొన్నారు. బొట్లపాలెంలో బ్రహ్మంగారి ఆరాధన సందర్భంగా వైసిపి ఆధ్వర్యంలో రెండు, తెలుగుదేశం ఒకటి, జనసేన ఆధ్వర్యంలో ఒక విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశాయి. విద్యుత్ ప్రభలపై జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ, జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు ప్రభలపై టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత సాగర్ మాట్లాడారు.

కొనకనమిట్ల : మండల పరిధిలోని కొనకనమిట్ల, చినమనగుండం, గనివేనపాడు, మునగపాడు, పెదారికట్ల గ్రామాలలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రజలు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గనివేనపాడులో పాలూరి కాశయ్య కుమారుడు పాలూరి రవి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రాత్రికి కోలాటం, భజన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఫిజియోథెరపిపై శిక్షణ

ప్రజాశక్తి- మద్దిపాడు : శారీరక బలహీనతలు ఉన్నప్పుడు ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఎంపిడిఒ శ్రీనివాస వరప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫిజియోథెరిపిపై సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ హైదరాబాదులోని నిజాం ఫిజియోథెరపీ ఇన్స్టిట్యూషన్ వైద్యుడు డాక్టర్ వెంకట రమణ ఆధ్వర్యంలో ఫిజియోథెరిపిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రఘుబాబు, బిపిటి తేజ, ట్రైనర్, సచివాలయ,ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-పొన్నలూరు : ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు నిబంధనల మేరకు ప్రయాణికులను ఎక్కించు కోవాలని కనిగిరి డిఎస్‌పి సాయి ఈశ్వర్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ట్రాక్టర్, ఆటో డ్రైవర్లు పరిమితం మించి రైతు కూలీలు, ప్రయాణికులను వాహనంలో ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.18 సంవత్సరాల లోపు పిల్లలు వాహనాలు నడిపినట్లయితే చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనుక్, పోలీస్ సిబ్బంది, వాహన చోదకులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

విశ్రాంత వార్డెన్, ఎఎస్‌డబ్ల్యు మేడికొండ లక్ష్మీనరసు 4 వర్ధంతి సందర్భంగా శ్రీశ్రీ విద్యార్థి ఫౌండేషన్ చైర్మన్ గుడిమెట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో గర్భిణులు, చిన్నారులకు బుధవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలిరెడ్డి నగర్‌లో గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుడిమెట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంతోమంది పేద విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన తమ గురువుకు ఇలా నివాళి అర్పించడం ఆనందంగా ఉందన్నారు. పేద విద్యార్థులకు విద్యాపరమైన ప్రోత్సాహం అందించడానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమతో పాటుగా

పౌష్టికాహారం అందజేస్తున్నదాత

శింగరాయకొండ ప్రభుత్వ హాస్టల్లో వసతి పొంది ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించిన అనేక మంది విద్యార్థులు నేడు దేశంలోని నలుమూలల వివిధ ప్రభుత్వ శాఖలలో, ప్రైవేట్ రంగంలో ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ షేక్ రిజ్వానా, ప్రభుత్వ హాస్టల్ పూర్వ విద్యార్థులు బొందు ప్రసాద్,పులి అంకయ్య, అంగన్‌వాడీలు ఉన్నారు.

20 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20,21,22 తేదీల్లో సమ్మెకు సన్నద్ధం కావాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. సంఘ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికులు మస్టర్ పాయింట్ వద్ద సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చీకటి శ్రీనివాస రావుమాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లు తెస్తుందన్నారు. దానికి వ్యతిరేకంగా ఈనెల20న మున్సిపల్ కార్మికులందరూ సమ్మెకు సన్నద్ధం కావాలన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి.. కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు, చీమకుర్తి, పొదిలి,కనిగిరి, గిద్దలూరు,

మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

మార్కాపురం దర్శిలో మున్సిపల్ కార్మికులను అపారన్నారు. మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై. రవికుమార్, సిహెచ్.అక్కేశ్వరరావు, బి అరుణ కుమారి, కె.పద్మ, బి.చిన్నబ్బాయి, డి. వెంకట్రావు, కె. వెంకటరమణ, జయలక్ష్మి, కుమారి, సుబ్రహ్మణ్యం, పి.పద్మ, వి. నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ అమ్మవారి జయంతి

ప్రజాశక్తి-చీమకుర్తి

శ్రీ వాసవీ అమ్మవారి జయంతి స్థానిక హరిహర క్షేత్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 102 కలశాలతో మహిళలు ఊరేగింపు నిర్వహించి అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం వాసవీ అమ్మవారి నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా సంఘం గౌరవాధ్యక్షురాలు శిద్దా లక్ష్మీ పద్మావతి, శిద్దా వెంకటేశ్వర్లు,శిద్దా పాండురంగారావు

పూజలు నిర్వహిస్తున్న శిద్దా పద్మావతి

దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా సురేష్ దంపతులు, శిద్దా బాలాజీ దంపతులు, శిద్దా హనుమంతరావు దంపతులు, శిద్దా వెంకట ఆంజనేయ ప్రసాద్ దంపతులు, హరిప్రియ గ్రానైట్స్ అధినేత నూనె వెంకట సుబ్రహ్మణ్యం, ఒంగోలు గెలాక్సీ గ్రానైట్స్ అధినేత చలువాది బదరీ నారాయణ, కూరపాటి సుబ్బారావు దంపతులు, మండల ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు సువర్ణ, పి. పద్మ పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఐదు నెలల క్రితం తప్పిపోయిన చిన్నారి ఎట్టకేలకు తల్లిదండ్రుల వద్దకు చేరింది. అందిన వివరాల ప్రకారం..శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని గుజ్జుల యలమందరెడ్డి నగర్‌కు చెందిన గుడిపూడి లక్ష్మి అనే ఐదేళ్ల చిన్నారి ఐదునెలల క్రితం తప్పిపోయింది. బాపట్ల రైల్వేస్టేషన్‌లో ఉండగా ఒంగోలు చిల్డ్రన్ హోంకు తరలించారు. చిల్డ్రన్ హోం సిబ్బంది పాప ఆచూకీ కోసం ఆరా తీశారు. చిన్నారిది శింగరాయకొండ ప్రాంతమని పలు కాలనీల్లో సందర్శించారు. చివరకూ గుజ్జుల యలమందరెడ్డి నగర్‌గా నిర్ధారణకు వచ్చారు. ఈ విషయం గురించి శింగరాయకొండ ఎస్ఐకు సమాచారం అందించారు. ఎస్ఐ బి.మహేంద్ర లక్ష్మి గుజ్జుల యలమందరెడ్డి నగర్‌కు చెందిన గుడిపూడి తిరుపతమ్మ కుమార్తెగా నిర్ధారించారు. కుటుంబ సభ్యులను బుధవారం పోలీస్ స్టేషన్ పిలిపించి వివరాలు సేకరించి లక్ష్మిని వారి అప్పగించారు.

కుట్టుశిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- టంగుటూరు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని జరుగుమల్లి ఎంపిడిఒ ఎంవి. రమణమూర్తి తెలిపారు. జరుగుమల్లి మండల పరిషత్ కార్యాలయంలో బీసీ, కాపు, ఇఎంఎస్ వర్గాలకు చెందిన మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ టైలరింగ్‌లో రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఒక బ్యాచ్‌కి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5 గంటల వరకూ మరో బ్యాచ్‌కి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో 75 శాతం హాజరు ఉన్న వారికి శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, జరుగుమల్లి మండల ప్రధాన కార్యదర్శి నరాల సోమయ్య, దగ్గుమాటి సుబ్బారెడ్డి, కొండూరి శివ కృష్ణా రెడ్డి, ఎపిఎం జయరాజ్, పంచాయితీ కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- మద్దిపాడు : మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రోత్ సెంటర్లో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం, ధ్వజ, యంత్ర, శిఖర ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని ఏర్పాట్లను కమిటీ బుధవారం పర్యవేక్షించింది. పిఠాపురం వాస్తవ్యులు బ్రహ్మశ్రీ వేదమూర్తులైన వింజమూరి అచ్యుతానంద శర్మ అవధాని, వింజమూరి రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం గం. 7.03 మూడు నిమిషాలకు విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిఐటియు అనుబంధ ఫెడరేషన్‌తోనే సంప్రదింపులు

ఎపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి వర్కర్స్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి

ఐటిసి యాజమాన్యంకు వినతి పత్రం అందిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి - చీరాల

లేబర్ కోడ్స్ రద్దు కోసం మే 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో ఐఎల్టిడి కార్మికులందరూ పాల్గొనాలని ఎపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్టిడి కంపెనీ వర్కర్స్ (సిఐటియు అనుబంధ సంఘం) కార్మికులందరూ సమ్మెలో పాల్గొనాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోసాల సుధాకర్, కె ధనలక్ష్మి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ప్లాంట్ 2 క్యాజువల్స్‌ను క్లాస్ బి వర్కర్స్‌గా చేయాలని, బదిలీ కార్మికులకు నోటీసు బోర్డు వెంటనే వేయాలని, కెవైసి పేరుతో ఆగిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏప్రిల్ 7న ఐటీసీ ఐఎల్టిడి ఎబిడి ఈఆర్‌ఎంకు వినతి పత్రంను మెయిల్ చేసినట్లు తెలిపారు. ఫెడరేషన్ చీరాల బ్రాంచ్ కమిటీ నాయకత్వంతో కలిసి పర్సనల్ మేనేజర్ ఎన్ రామకృష్ణకు తన ఛాంబర్‌లో బుధవారం వినతి పత్రం అందజేశారు. రామకృష్ణ వినతిపత్రంపై స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి విషయాన్ని తెలియజేస్తామని అన్నారు. 2023 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల వెరిఫికేషన్‌లో ఎపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్టిడి కంపెనీ వర్కర్స్ సిఐటియు అనుబంధ సంఘం గుర్తింపు పొందిందని, ఈ యూనియన్ నాయకత్వంతో చర్చలు జరపాలని, ఫెడరేషన్ రిజిస్టర్ నెంబర్‌తో ఎవరైనా వినతి పత్రాలు మేనేజ్మెంటుకు ఇస్తే లీగల్‌గా ప్రొసీడ్ అవుతామని యాజమాన్యంకు తెలిపారు. యూనియన్ విచ్ఛిన్నానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే యూనియన్ నుంచి ఆరుగురుని బహిష్కరించామని, కార్మికులకు మాయమాటలు చెప్పి మోసం చేసేవారిని కార్మికులు క్షమించరని, తగిన గుణపాఠం చెబుతారని, కార్మికులను దోచుకుతినే వారికి గుర్తింపు సంఘం ఎపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్టిడి కంపెనీ వర్కర్స్ సిఐటియు అనుబంధ సంఘంలో స్థానం ఉండదని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి విలేకరులకు తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దుకై కార్మికులందరూ ఐక్యంగా మే 20న జరిగే సమ్మె పాల్గొనాలని ఐఎల్టిడి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గోసాల సుధాకర్, చీరాల బ్రాంచ్ ప్రెసిడెంట్ బి పోతురాజు, రాష్ట్ర కోశాధికారి పఠాన్ కాలేషా, చప్పిడి భాస్కర్, ఎం వసంతరావు, చింత శ్రీనివాస్, తిరుమలరావు, కొండ్రు ఎలీషా, బాలాజీ, సత్యమూర్తి, ఏసురత్నం, నక్కల నాగరాజు, రత్నరాజు, రమేష్, ముంగా నాగరాజు, శ్యాంబాబు తదితరులు ఉన్నారు.

కలెక్టర్ వెంకట మురళికి కరపత్రం అందజేస్తున్న దృశ్యం

అంబేద్కర్ జీవిత చిత్రం కుటుంబ సమేతంగా వీక్షించండి

కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 10న చీరాలలో ప్రదర్శన

ప్రజాశక్తి - చీరాల

రాజ్యాంగ నిర్మాత, స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవితంపై రూపొందించిన నాటకను కుటుంబ సమేతంగా అందరూ చూడాలని కలెక్టర్ వెంకట మురళి ప్రజలకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో కెవిపిఎస్ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి టి కృష్ణమోహన్, కెవిపిఎస్ చీరాల పట్టణ ఉపాధ్యక్షులు ఎన్ బాబురావు కలెక్టర్ చేతుల మీదగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ భవనం వద్ద ఈనెల 10న ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చిత్రం నాటకం అందరూ చూడాలని కోరారు. ఆధునిక రంగస్థలం వేదికపై విశ్వ జ్ఞాని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత నాటకం కెవిపిఎస్ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సహకారంతో సంఘం, చరణం, గచ్ఛామి అనే కళారూపం ద్వారా సామాజిక చైతన్య సాంస్కృతి ఉత్సవాల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 22న కర్నూలులో ప్రారంభమైనట్లు తెలిపారు. సమాజమే తన కుటుంబంగా భావించి కన్నబిడ్డ చావును కూడా వెలివాడల బతుకు భద్రత కోసం త్యాగించి, మనవాదపై పోరాటం చేసిన భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అనేక మందికి ఆదర్శమని అన్నారు. అలాంటి అంబేద్కర్‌పై కేంద్ర ప్రభుత్వం విషం జిమ్ముతున్న నేపథ్యంలో ఆయన త్యాగాలను ప్రజలకు తెలియజేయడం కోసం ఈ నాటకం ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ కొందరు వాడు కాదు, అందరివాడే అన్న సత్యాన్ని ప్రజల ముంగిట ఉంచేందుకు చేస్తున్న ప్రయత్నానికి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నరేంద్ర వర్మ

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా సూర్యలంక రోడ్డులో అల్లూరి విగ్రహానికి శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ పూల మాల వేసి బుధవారం ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శివ నారాయణ, టిడిపి నాయకులు గొలపల శ్రీనివాసరావు, పల్లం సరోజిని, ఆంధ్రేయ పాల్గొన్నారు.

ఠాగూర్, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు నివాళులు

సంతమాగులూరు : గ్రంధాలయ శాఖ నందు బుధవారం 9వ రోజు జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గ్రంథ పాలకుడు బాదం విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధులు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఇరువురి చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు.

రైతు కుటుంబానికి రైతు నేతల పరామర్శ

పరామర్శిస్తున్న రైతు నాయకులు సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని వీరన్నపాలెంలో పొగాకు కొనుగోలు జరగక అప్పులు బాధలు పెరిగి ఆత్మహత్య చేసుకున్న ఉప్పుటూరు సాంబయ్య కుటుంబాన్ని రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య, తలపనేని రామారావు, పి కొండయ్య, శ్రీనివాసరెడ్డి, మక్కెన వెంకన్న, డేవిడ్ తదితరులు బుధవారం పరామర్శించారు. రైతు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు సాంబయ్య గతేడాది 3 ఎకరాలు పొగాకు వేశాడని, వచ్చిన దిగుబడి తనకున్న అప్పులకు చాలా వని పొగాకు అమ్మకుండా నిల్వ ఉంచుకున్నాడని తెలిపారు. ఈ ఏడాది 5 ఎకరాలు పొగాకు సాగు చేశాడని, పొగాకు అమ్ముడుపోని పరిస్థితి ఏర్పడటంతో అప్పుల బాధ తట్టుకోలేక మంగళవారం తెల్లవారు జామున బలవన్మరణంకు పాల్పడ్డాడని తెలిపారు. పొగాకు అమ్ముడు పోనందువలనే మానసిక వేదనకు గురై గత్యంతరం లేక ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అందువల్ల రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సాంబయ్య కుమారుడు మంచి మార్కులతో 10వ తరగతి ఉత్తీర్ణుడు కాగా కుమార్తె ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుందని, వారి చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు. సాంబయ్యకు ఒక ఎకరా మాత్రమే సొంత భూమి ఉన్నందున ఇక ముందు కుటుంబ బాధ్యత, పిల్లల చదువులు భార్యకు మరింత భారం అవుతాయని అన్నారు. ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు.

రైతు కుటుంబానికి అధికారుల పరామర్శ

మండలంలోని వీరన్నపాలెంకు చెందిన కౌలు రైతు ఉప్పుటూరి సాంబ శివరావు (42) మంగళవారం తెల్లవారు జామున ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలుసుకున్న వ్యవసాయ, రెవెన్యూ అధికారులు బుధవారం పరామర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతు మృతికి కారణాలు సేకరించి వివరాలను ఉన్నత అధికారులకు పంపిస్తామని చెప్పారు. మృతి చెందిన రైతుకు ఎక్కడా సొంత పొలం లేదని, కౌలుకు మాత్రమే పొలం చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది గ్రామానికి చెందిన యార్లగడ్డ బుచ్చయ్య చౌదరి పొలం నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు పంట వేశారని పేర్కొన్నారు. కౌలు కార్డు మీద వీరన్నపాలెం యుబిఐ బ్యాంకులో రూ.ఒక లక్ష కౌలు ఋణం తీసుకుని ఉన్నారని, అలాగే బయట వ్యక్తుల వద్ద రూ.22 లక్షల అప్పు ఉన్నదని తెలిసిందని తెలిపారు. కూతురు ప్రియదర్శిని ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తయిందని, కొడుకు అజయ్ 10వ తరగతి కంప్లీట్ చేశారని వెల్లడించారు. జిల్లా వ్యవసాయ అధికారుల ఆదేశాలు ప్రకారం రైతు కుటుంబాన్ని సందర్శించి వివరాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎడిఎ మోహనరావు, ఎఒ రామ్మోహనరెడ్డి, తహశీల్దారు బ్రహ్మయ్య, విఎఎ మురళి పాల్గొన్నారు.

రైతు మృతదేహాన్ని సందర్శించిన అధికారులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న పార్థసారథి, ఏలూరి

ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారధి, శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా 37 మంది లబ్ధిదారులకు రూ.28,85,002 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, పేదలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి అనేక చర్యలు చేపడుతుందని అన్నారు. 2029లో మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, అప్పుడే ప్రజాస్వామ్యం మనుగడ, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మంత్రి సూచించారు. గత ప్రభుత్వం కంటే సంక్షేమ పథకాలను అత్యధికంగా అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే ఏలూరి విశేష ప్రజాదరణ కలిగిన నేతని పేర్కొన్నారు. ప్రజా సమస్యలకే ఎమ్మెల్యే ఏలూరి అత్యధిక ప్రాధాన్యత ఇస్తాడని, అభివృద్ధి సంక్షేమం తప్ప వేరే ఆలోచన ఉండదని అన్నారు. వివాద రహితుడిగా అభివృద్ధి కాముకుడిగా మంచి పేరు ఉందన్నారు. ఎమ్మెల్యే ఏలూరి తెలుగు దేశంకు నిబద్ధత కలిగిన నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడని అన్నారు. ఉన్నత ఆశయాలు కలిగిన స్వార్థం లేకుండా నియోజకవర్గ అభివృద్ధి ఆయన లక్ష్యం అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రంలో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. తమ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్య సంరక్షణకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని అన్నారు. తమది పేదల ప్రభుత్వం అన్నారు. ప్రజల మంచి కోరే ప్రభుత్వం అన్నారు. కష్టాల్లో బాధల్లో ఉన్న ప్రజలకు ఆసరాగా ఉండే ప్రభుత్వం అన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 730 మందికి రూ.4,65,54,512 నగదును ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిందని గర్వంగా చెప్పగలుగుతున్నానని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండలాల తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

బోడవాడలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

వేసవి తాపాన్ని తీర్చే ప్రయత్నంలో భాగంగా చీరాలకు చెందిన 'గేరాడ్స్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో మండలంలోని బోడవాడ గ్రామంలో ఉచిత చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్చూరు పంచాయితీ రాజ్ అధికారి మస్తానరావు, మాజీ ఎంపిపి కొల్లా వెంకట్రావు, రిటైర్డ్ నేవీ ఆఫీసర్ వడ్రాణం బాబురావు మాట్లాడుతూ గేరాడ్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను అభినందించారు. దాతలు ముందుకు వచ్చి వేసవి పూర్తయ్యే వరకు ప్రధాన కేంద్రాల్లో తాగునీటి అవసరాలు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన ట్రస్టీ గేరా స్వరాజ్, ట్రస్టీలు తానికొండ జయానంద్, అల్లాడి సంతోషం, స్థానిక నాయకులు కూరాకుల ఇస్సాకు బాబు, గాజుల రమేష్, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోడవాడలో 'గేరాడ్స్' చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

కార్మిక చట్టాలు మార్చాలని ,లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో ద్యోగులు, కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. సిఐటియు నగర అధ్యక్షుడు సిహెచ్.రాంబాబు అధ్యక్షతన సమ్మె సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను మార్చాలని, కార్మికులకు అమలు అవుతున్న కొద్దిపాటి సంక్షేమ పథకాలు నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో కొత్త లేబర్ కోడ్‌లు తెస్తున్న కేంద్రం ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ విధానాలు వేగంగా అమలు చేస్తుందన్నారు. కార్పొరేటర్లకు అనుకూలంగా కార్మికవర్గంపై బానిసత్వాన్ని అమలు చేయటానికి, 29 కార్మికు చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్‌ను 2025 ఏప్రిల్ నుంచి నోటిఫై చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. సిఐటియు నగర కార్యదర్శి టి. మహేష్ మాట్లాడుతూ కార్మిక వర్గం నేడు అనుభవిస్తున్న చట్టాలన్నీ బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్నవని తెలిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రైవేటీకరణ వల్ల అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నట్లు తెలిపారు. పని భద్రత లేకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేతన కోడ్‌లోకనీసం రోజువారీ కనీస వేతనం అతి తక్కువగా 178 రూపాయిలుగా నిర్ణయించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా యాజమాన్యాలు వేతనాలు పెంచకుండా కార్మికులను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ రోజుకి 7 గంటలు చొప్పున వారంలో ఐదు రోజులు 35 గంటలు మాత్రం పనిచేయాలని తీర్మానించినట్లు తెలిపారు. కార్మికులను దోపిడీ చేసేందుకు వారానికి 90 గంటలు పని చేయాలని ప్రకటన చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి దుర్మార్గ చర్యలు కార్పొరేటర్లు సంస్థల యాజమానులకు అనుకూలంగా ఉన్న చట్టాలు అవలంబిస్తే రానున్న రోజుల్లో కార్మికుల చేత వెట్టిచాకిరి చేయిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, దామా శ్రీనివాసులు ,జి.రమేష్, మెడికల్ రిప్ యూనియన్ నాయకులు కష్ణమోహన్, జైఉదయ్ కిరణ్ ,మున్సిపల్ యూనియన్ నాయకులు జి.నరసింహ, టి. విజయమ్మ , కె.సామ్రాజ్యం, రాములు, ఆటో యూనియన్ నాయకులు రామిరెడ్డి, ఎ. కోటేశ్వరరావు , శ్రీనివాసరావు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఆంజనేయులు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు కె.గోపి, వెంకట్రావు భారతి , అనిత ,శేఖర్, శ్రీనివాసరావు,కొండారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమ్మెనోటీసు అందజేత

ఈనెల 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సివిల్ సప్లయ్ హమాలీల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు తెలిపారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వరలక్ష్మిని హమాలీల యూనియన్ నాయకులు బుధవారం కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ కార్మిక వర్గానికి కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలన్నారు. ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సివిల్‌సప్లయ్ ఎంఎల్ఎస్ పాయింట్స్‌లోని హమాలీలకు ఇఎస్ఐ అమలుకు ఆటంకంగా ఉన్న కోర్టుకేసులను ఉపసంహరించుకోవాలన్నారు. ప్రమాదంలో మరణించిన ముఠా కార్మికులకు రూ 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కార్యదర్శులు బి.ఆంజనేయులు , కె. గోపీనాథ్ సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న డీడీ లక్ష్మానాయక్

సంజీవయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు దామోదరం సంజీవయ్య 53వ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం భవనం ఎదురుగా ఉన్న దామోదరం సంజీవయ్య కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యన్.లక్ష్మా నాయక్,సంజీవయ్య విగ్రహ కమిటీ వ్యవస్థాపకులు యాదాల అరుణకుమార్,గుర్రాల రాజ్ విమల్, సహాయ సంక్షేమాధికారి మధుసూధన రెడ్డి పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్‌లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఉగ్రవాదం మరియు ఉన్మాదం ఏరూపంలో వున్నా, ఏ దేశంలో వున్నా మానవాళికి నష్టం కలిగించేదని, ఉగ్రవాదం అంతం కావాల్సిందేనని వైసిపి ఒంగోలు నియోజకవర్గ సమన్వయ కర్త చుండూరు రవిబాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ సింధూర్‌లో అందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. భారత సైన్యం ప్రదర్శించిన సైనిక పాటవానికి ఓ భారతీయుడుగా తాను గర్వపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారతసైన్యం వీరోచిత విన్యాసాలు జయప్రదం అయ్యేందుకు ప్రతి పౌరుడూ సంఘీభావం వ్యక్తం చేయాలని ఆయన తెలిపారు.

పారిశుధ్య కార్మికులను అవమానించడం తగదు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల శ్రమపై ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు కౌన్సిల్ సమావేశంలో మాట్లాడిన తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిఐటియు ఒంగోలు నగరకమిటీ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.రాంబాబు, టి.మహేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో పారిశుధ్య విభాగం నగరంలో చాలా దారుణంగా ఉందని కార్మికులు టైం పాస్ చేస్తూ, ప్రతి నెల ఒకటో తారీకు వేతనాలు తీసుకుంటున్నారని ప్రజాప్రతినిధులు వ్యాఖ్యానించడం కార్మికులను అవమానపరచడమేనని వారు పేర్కొన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు నగరంలో పారిశుధ్య విభాగంలో మేస్త్రీల వ్యవస్థను రద్దు చేస్తున్నామని 115 మంది కార్మికులను తొలగించారన్నారు. టెండర్ రద్దయిందని క్లాప్ వాహన డ్రైవర్లను 64 మందిని తొలగించారన్నారు. మొత్తం 180 మంది కార్మికులను వివిధ కారణాలతో నిలిపి వేసినట్లు తెలిపారు. వెంటనే ఖాళీగా ఉన్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల పర్మినెంట్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఒంగోలు నగర విస్తరణ మరియు తడి చెత్త ,పొడి చెత్త టన్నుల కొద్దీ పెరుగుతుందని పేర్కొన్నారు.ఉదయం 4.30 గంటల నుంచే విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య చేస్తున్న కార్మికులపట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని పల్లమల్లి బీసీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవ కార్యక్రమాలలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ డిఇ మోహన్ రావు, టిడిపి నాయకులు వజ్జా సుబ్బారావు, అన్నంనేని రాఘవయ్య, కరిచేటి వెంకటేశ్వర్లు, వేల్పుల శ్రీనివాసరావు, కె. లోకేష్, ఎడ్లపల్లి రామబ్రహ్మం, మన్నం శేషయ్య,సుబ్బారావు పాల్గొన్నారు.

గణితంపై భయం పోగొట్టేలా అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు మూడో రోజున బుధవారం వేదిక్ గణితంను విశ్వం ఎడ్యూ టెక్ సంస్థ ట్రైనర్స్ నేర్పించారు. గణితం అంటే భయపడే విద్యార్థులకు గణితంతో ఫన్నీగా ఆటలు ఆడుకోవడం వంటివి నేర్చుకోవడంతో గణితంపై ఇష్టం పెరుగుతుందన్నారు. మాంటిస్సోరి స్కూల్ ప్రిన్సిపల్ నిరుద్దీన్ ఫన్నీ మ్యాథ్స్ నేర్పారు. క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకున్నారు. జ్యోతి, రామన్, వీరాస్వామి, వినోద్ ఆటలు, పాటలు నేర్పారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

రజకుల సంక్షేమానికి కృషి

రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

రజకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి.శారద తెలిపారు. స్థానిక ఎన్ఎస్‌పి అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శారద మాట్లాడారు. రజకుల సంక్షేమానికి, రక్షణకు నిర్దేశించిన చట్టాల అమలు దిశగా కూటమి ప్రభుత్వం కషి చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖ, మెడికల్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ దోబీ పోస్టులు రజకులకే కేటాయించేందుకు నిర్దేశించిన జీవో 27 అమలు దిశగా కూటమి ప్రభుత్వం యోచిస్తుందన్నారు.బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ యువతకు మునుపెన్నడూ లేని రీతిలో పలు సంక్షేమ పథకాలతో ఉపాధి కల్పిస్తుందన్నారు. ప్రత్యేకించి మహిళ అభివృద్ధి కోసం ప్రభుత్వం వివిధ పథకాలు రూపొందించినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలో బీసీ కార్పొరేషన్ రుణాలకు 6372 ధరఖాస్తులు రాగా అందులో 3152 మహిళలు ఉండడం విశేషమన్నారు. టైలరింగ్ ద్వారా మహిళలు అభివద్ధి చెందేలా జిల్లాలో 31 కుట్టుశిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో 1750 మంది రజక మహిళలు శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. ఆదరణ-3 పథకం ద్వారా రజక వత్తి దారులకు అనేక పథకాలు రూపొందించినట్లు వివరించారు.వత్తిదారులకు యూనిట్లు పంపిణీలో ప్రకాశం జిల్లా ముందుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావును అభినందించారు.


మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

మానిటరింగ్ కమిటీ అమలు చేయాలి...

రజకులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు నిరోధించేందుకు నిర్దేశించిన(జీవో నెం6) మానిటరింగ్ కమిటీ అమలులోకి తేవాలన్నారు గత పది పన్నెండు ఏళ్లుగా మానిటరింగ్ కమిటీ అమలు కావడం లేదన్నారు. మానిటరింగ్ కమిటీ అమలుకు, రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేయనున్నట్లు ఈ సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘాల నేతలు పొదిలి శ్రీనివాసరావు, చిన్న వెంకట నారాయణ, రాజశేఖర్, శంకర్, శ్రీకాంత్, జయరాం, జయప్రసాద్ పాల్గొన్నారు.

వైవి సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటాద్రిరెడ్డి

వైవిని కలిసిన వెంకటాద్రిరెడ్డి

ప్రజాశక్తి-కొండపి

రాజ్యసభ సభ్యులు, టిటిడి మాజీ చైర్మన్ వైవి. సుబ్బారెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో కొండపి జడ్‌పిటిసి అరుణ భర్త వెంకటాద్రి రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.. ఈ సందర్భంగా కొండపి మండలంలో వైసిపి పరిస్థితి గురించి ఇద్దరు చర్చించుకునర్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు వేముల రమేష్ , భీమనాథం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- కొత్తపట్నం

మండల పరిధిలోని రాజుపాలెం బస్టాండ్ సెంటర్ వద్ద వైసిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కొత్తపట్నం ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రాజుపాలెం గ్రామంలో చలివేంద్రం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్ర మాలు నిర్వహించడం ద్వారా పార్టీ పట్ల ప్రజల్లో మంచి స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈతముక్కల ఎంపిటిసి రవీంద్రారెడ్డి వైసిపి గ్రామ అధ్యక్షుడు గొల్ల కపారావు, నాయకులు ద్వారం హేమంత్ రెడ్డి, కొండూరి గోవింద్, సామంతుల చంద్రశేఖర్ రెడ్డి ,కొల్లూరి సంజీవరావు, పంచాయతీ వార్డు నెంబరు జిలాని, ఎం.నాంచార్లు పాల్గొన్నారు.

స్టేషన్ పనులు పరిశీలిస్తున్న మేనేజర్ సుధేష్టసేన్

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

ప్రజాశక్తి - రేపల్లె

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ చెప్పారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. తీర ప్రాంతంలో చిట్టచివరి రైల్వేస్టేషన్ అయిన రేపల్లెను మరింత అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అమృత్ భారత్ పథకంలో స్టేషన్ వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. అన్ని సదుపాయాలతో నూతన భవన నిర్మాణాలతో పాటు ప్రయాణికులకు కావాల్సిన వసతులను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అత్యాధునిక స్టేషన్ నిర్మాణం తోపాటు ప్రయాణికులు వేచి ఉండే విశ్రాంతి గది, డిజిటల్ బోర్డ్, ఎస్కలేటర్ సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. అభివృద్ధి పనులు పరిశీలించి అధికారులతో మాట్లాడారు. స్టేషన్ పరిసలు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు ప్రజాసంఘాల నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిఒఎం శ్రీనాథ్, డిఇఎన్ శేషు, డిఈడబ్ల్యూ సుదర్శన్, నాయక్, గోపీచంద్ పాల్గొన్నారు.

ముప్పవరంలో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని ముప్పవరం గ్రామంలో పొగాకు కొనుగోలు ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. మండలం తోపాటు చుట్టుపక్కల ఉన్న మార్టూరు, అద్దంకి, కొరిశపాడు మొదలైన మండలాల్లో కూడా ఈ సంవత్సరం బర్లిపొగాకు విపరీతంగా సాగు చేశారు. రైతు, కౌలు రైతు సంఘం పోరాట ఫలితంగా ప్రభుత్వం బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కంపెనీల ద్వారా కొనుగోలు చేయించేందుకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ముప్పవరం కేంద్రంలో కొనుగోలు కేంద్రం పెడితే రైతులు, కంపెనీలకు ఉపయోగంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. జాతీయ రహదారిపై ఉండి అన్ని ప్రాంతాలకు సెంటర్ పాయింట్‌గా ఉన్న ముప్పవరంలో కొనుగోలు కేంద్రం పెడితే రైతులు రవాణా కూడా బాగుంటుందని చెబుతున్నారు. అధికారులు పరిస్థితిని పరిశీలించి ముప్పవరంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి

ప్రజాశక్తి - రేపల్లె

మోపిదేవి సుమతి (42)

విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి చెందిన సంఘటన పట్టణంలోని ఇసుకపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం 17వ వార్డుకు చెందిన మోపిదేవి సుమతి (42) అనే మహిళ నిమ్మ చెట్టుకు నీళ్లు పోస్తున్న క్రమంలో పక్కనే ఉన్న కరెంటు స్తంభం విద్యుత్ వైర్లు నిమ్మచెట్టుకు ఆనుకుని ఉండటంతో ప్రమాద వశాత్తు కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన ఆమె భర్త వెంటనే స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌కి తీసుకువెళ్ళగా డాక్టర్ చూసి చనిపోయినట్లు చెప్పారు. అప్పటి వరకు తమతో ఉన్న ఆమె మృతితో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అయ్యారు. మృతురాలి భర్త ఇచ్చిన రిపోర్ట్ మేరకు సీఐ ఎ మల్లిఖార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలీలకు అరకొరగానే ఉపాధి పనులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈ ఏడాది డెల్టా ప్రాంతంలో ఉపాధి హామీ పథకం క్రింద కూలీలకు చూపించే పని దినాలు అర కొరగానే ఉన్నాయి. ఈ ప్రాంతంలో పంట పొలాలకు సాగునీళ్లు అందించే చిన్నచిన్న కాలువలు తప్ప కూలీలకు అధిక మొత్తంలో పని దినాలు కల్పించే చెరువులు, కుంటలు లేకపోవడంతో కూలీలకు సరైన పని దొరకటం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. జాబు కార్డు కలిగిన వారిలో అధిక శాతం మంది ఈ ఏడాది ఉపాధి హామీ పథకం పనులు చేసేందుకు పనికి వస్తుండడంతో అధికారులు పనులు చూపించేందుకు తల మునకలవుతున్నారు. ఓ పక్క ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పని దినాలు జరిపించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తుండగా అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు జరిపించిన అవకాశం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది కొన్ని గ్రూపులు ఒక వారానికి మించి పనిచేయకపోవటం, మరికొన్ని గ్రూపులు రెండు లేదా మూడు వారాలకు మించి పనిని జరిపించలేకపోయారని కూలీలు చెబుతున్నారు. కూలీల పని దినాలు పెరగటానికి పంట పొలాల్లో రైతులు నీటి కుంటలను ఏర్పాటు చేయించుకుంటే తద్వారా అధిక పని దినాలు నమోదయ్యే అవకాశం ఉంది. కానీ గతంలో పలువురు రైతులతో పాటు దేవస్థాన భూముల్లో కూడా నీటి కుంటలు ఏర్పాటు చేసి కూలీలకు పనిని కల్పించి పని దినాలు పెంచేశారు. ఆ నీటి కుంటల వలన రైతులకు ఆనాడు ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో క్రమంగా వాటిని పూడ్చివేశారు. గత మూడేళ్ల నుండి భట్టిప్రోలు, రేపల్లె, వేమూరు తదితర ప్రాంతాల్లో ప్రధాన మురుగు కాలువలను కూడా ఉపాధి పథకం కింద కూలీలతో పనిచేయడంతో ప్రభుత్వ లక్ష్యం కొంతమేర నెరవేరింది. కానీ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే కురిసిన అధిక వర్షాల కారణంగా నీరు వెళ్లే మార్గం లేక పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. దీనికి కారణం మురుగు కాలువలు పూడిపోయి నీరు బయటకు వెళ్లే మార్గం లేక పంట పొలాలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణం మురుగు కాలువలను కూలీలతో చేయించడం వలన కాలువ లోతు తగ్గిపోయి ఎక్కడికి అక్కడ పూడిక పెరిగిపోవడం వలనే ఇలాంటి ఉపద్రవం సంభవించిందని, ఈ ఏడాది మురుగు కాలువలను ప్రొక్లైన్ల ద్వారా పూడిక తీయించి కట్టలు బలపరిస్తే రైతులకు కొంతమేర ముంపు భాధ నుండి బయటపడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

ఉపాధి హామీ పనులు చేస్తున్న కులీలు

వర్షాలతో పూడికతీత పనులు జరిగేనా ?

ఈ ఏడాది మే నెల ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండటంతో మురుగు కాలువల కూడికచేత, ఉపాధి హామీ పథకం లక్ష్యం ఏ మేరకు నెరవేరుతుందని రైతులు, ఉపాధి కూలీలు ప్రశ్నిస్తున్నారు. గతేడాది మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా 2.25లక్షల పని దినాలు కల్పించాలని నిర్దేశించగా దానిలో రెండు లక్షలపైగా పని దినాలు అధికారులు కల్పించారు. ఈ ఏడాది మరో 10 వేలు పని దినాలు అదనంగా కలిపి 2.35లక్షల పని దినాలు నిర్దేశించారు. అయితే ఈ లక్ష్యం నెరవేరడానికి మురుగు కాలువలు లేకపోవడంతో అధికారులు (ఫాం పాంట్స్) నీటి కుంటలు తీస్తే తప్ప లక్ష్యం నెరవేరే పరిస్థితి లేదు. ఇందుకోసం సంబంధించిన అధికారులు రైతులను ఒప్పించి నీటి కుంటలు తీయించే పనిలో నిమగ్నమయ్యారు. దీనిలో భాగంగా ఐలవరంలో రెండు నీటి కుంటలకు సోమవారం శ్రీకారం చుట్టినట్లు ఎపిఒ శివ పార్వతి తెలిపారు. ఇదిలా ఉండగా ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించే సమయానికి ఆయా మండలాల నుండి టెక్నికల్ అసిస్టెంట్లను బదిలి చేయడంతో గుర్తించిన పనులను ఉన్నత అధికారులకు నివేదించి అనుమతులు పొందటంలో కొంతమేర జాప్యం జరగటం కూడా ఒక కారణంగా కనిపిస్తోంది. ప్రస్తుతం గుర్తించిన పనులకు అనుమతులకై ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందని, మరో వారం రోజుల్లో కూలీలకు పనులు కల్పించనున్నట్లు శివపార్వతి చెప్పారు.

మట్టి నమూనా ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం

ప్రజాశక్తి - కర్లపాలెం

మట్టి నమూనాల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు హుస్సేన్ అన్నారు. స్థానిక సచివాలయం నందు మట్టి నమూనాల ఆధారంగా ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం పరిధిలోని గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్నారని, సేకరణలో భాగంగా రైతులు సిబ్బందికి సహకరించాలని కోరారు. మట్టి నమూనాలు, పాటించాల్సిన మెళుకువలు తెలిపారు. మట్టి నమూనాల ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగించాలని కోరారు. చౌడు భూముల పునరుద్ధరణకు పచ్చిరొట్ట పైర్లు ప్రధాన పాత్ర పోషిస్తాయని వివరించారు. కారు చౌడు ఉన్న నెలల్లో జిప్సం వినియోగం గురించి తెలిపారు. బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మి మాట్లాడుతూ నేలల్లో సేంద్రీయ కర్బనం పెరగడానికి పచ్చిరొట్ట పైరు వేసి కలియ దున్నాలని సూచించారు, తద్వారా భూమిలో సూక్ష్మ జీవులు వృద్ధి చెందడంతో పాటు భూమి గుళ్ళబారుతుందని వివరించారు. వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పథకాలు వివరిస్తూ రైతులందరూ భూ ఆధార్ కలిగి ఉండాలని, తద్వారా వివిధ పథకాలకు అర్హత లభిస్తుందని తెలిపారు. కర్లపాలెం రెవెన్యూలో భూ ఆధార్ పరంగా తలెత్తిన సాంకేతిక సమస్య నివృత్తి అయిందని తెలిపారు. కావున రైతులు త్వరపడి నమోదు చేయించుకోవాలని సూచించారు. కౌలు దారులు కౌలు కార్డులు విఆర్‌ఒల ద్వారా తీసుకోవాలని చెప్పారు. తద్వారా వ్యవసాయ శాఖ ద్వారా అనేక పథకాలకు అర్హత పొందవచ్చని తెలిపారు. రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకం అందుబాటులో ఉన్నదని, అర్హత ఉన్న రైతులు త్వరపడి ఈ నెలాఖరు లోపల నమోదు చేసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ పథకంకు సంబంధించిన 20వ విడత జూన్ మొదటి వారంలో పడుతుందని తెలిపారు. అర్హత కలిగి నమోదు చేసుకోదలచిన రైతులు కామన్ సర్వీసు సెంటర్లలో నమోదు చేసుకోవాలని చెప్పారు. పీఎం కిసాన్ పథకంలో నమోదై వివిధ కారణాల వల్ల నగదు జమ కాని రైతులు వివిఎలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ సుమంత్ కుమార్, విస్తరణ అధికారి భాగ్యలక్ష్మి, వివిఎ భ్రమరాంబదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ హుస్సేన్

మోటార్లు, వైర్ల దొంగలపై నిఘా ఉంచాలి

ప్రజాశక్తి - బట్టిప్రోలు

పంట పొలాల్లోని విద్యుత్ మోటార్లు, వైర్లను అపహరించకపోతున్న దొంగలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సిపిఐ నాయకులు నాగాంజనేయులు కోరారు. లంక గ్రామాల్లో, మాగాణి భూముల్లో పంటలకు భూగర్భ జలాలను అందించేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లకు సంబంధించి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించకపోతున్నారన్న విషయం తెలుసుకున్న సిపిఐ బృందం బుధవారం లంక గ్రామాల్లో పర్యటించారు. విద్యుత్ వైర్లు అపహరణకు గురైన తీరును పరిశీలించారు. అనంతరం రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైర్ల చోరీ విషయమై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు ఆయా ప్రాంతాల్లో మోటార్ల వైర్లు అపహరణకు గురైన తీరును పరిశీలించి వెళ్లినట్లు రైతులు తెలిపారు. బండారు శ్రీనివాసరావు, గొట్టుముక్కల బాలాజీ, రైతులు కొమ్మినేని శ్రీమన్నారాయణ, కొసరాజు సతీష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ నాయకులు నాగంజనేయులు

దేవస్థానం ధర్మకర్తల నియామక దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండల పరిధిలోని గుల్లపల్లి గ్రామ దేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానంనకు సంబంధించిన ధర్మకర్తల మండలి నియామకంనకు ఆసక్తి కలిగిన వారిచే దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇఒ నరసింహమూర్తి తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు ధర్మకర్తల మండలిలో చైర్మన్, సభ్యులుగా చేరేందుకు దేవాదాయ శాఖ నియమ నిబంధనల ప్రకారం పూర్తిచేసిన దరఖాస్తులను మే 26లోగా దరఖాస్తులను జిల్లా దేవాదాయ శాఖ అధికారికి అందజేయాలని తెలిపారు. నిబంధనల మేరకు ఎంపిక చేస్తారని తెలిపారు.

జెసిబితో మరమ్మతులు చేయిస్తున్న మున్సిపల్ అధికారులు

డ్రైనేజీ కాల్వలకు మరమ్మతులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని మసీదు సెంటర్లో డ్రైనేజీ మురుగు నీరు పారుదల లేక మురుగు అంత రోడ్లపై చేరి వరదను తలపిస్తుందని, దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 'ప్రజాశక్తి వెబ్ న్యూస్'లో 'వర్షపు నీరు కాదు. ఇది మురుగు నీరు.' అంటూ వచ్చిన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు సిబ్బందితో కలసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రోడ్లపై మురుగనీరు అధికంగా చేరడంతో తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు. జెసిబి సాయంతో సాయంత్రానికి మురుగు కాలువలు మరమ్మతులు చేయించి, వ్యర్థాలు తొలగించారు. దీంతో మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ఆ ప్రాంత ప్రజలు అభినందించారు.

ప్రజాశక్తి
గురువారం 8 మే 2025

ఎమ్మెల్యే కొండయ్యతో ఒకటో వార్డు కౌన్సిలర్ మొగిలి బాజ్జి

ఎమ్మెల్యే కొండయ్యకు వైసీపీ కౌన్సిలర్ బాజ్జీ మద్దతు

ప్రజాశక్తి- చీరాల

పట్టణంలోని 1వ వార్డు వైసిపి కౌన్సిలర్ మొగిలి బాజ్జి శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య, తెలుగుదేశం నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాద్‌ను విజయవాడలోని ఆయన స్వగృహంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి తన మద్దతు తెలియజేశారు. ఈ నెల14న మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం జరగనున్న నేపథ్యంలో బాజ్జి టిడిపి మద్దతు తెలపడం చర్చనీయాంశమైంది. ఈపాటికే 22 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే కొండయ్య వెంట ఉండగా మరో వైసీపీ కౌన్సిలర్ టిడిపికి మద్దతు తెలపటంతో అవిశ్వాసంకు అవసరమైన సంఖ్య 23కు చేరింది. ప్రస్తుతం ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో టిడిపికి 23 మంది కౌన్సిలర్ల మద్దతు ఉండడంతో ఇది హాట్ టాపిక్‌గా మారింది.

సమ్మెలో పాల్గొన్న సిహెచ్వోలు

సిహెచ్ఒల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

వైద్య ఆరోగ్య శాఖలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్ల సాధనకు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 9వ రోజుకు చేరింది. వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం పథకం ద్వారా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైద్యారోగ్య జిల్లా అధికారి కార్యాలయం ఎదురు శాంతియుత సమ్మెకు దిగినట్లు సమ్మెకు నాయకత్వం వహిస్తున్న వీర ప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్ఎన్ రాజు, రాజా కృపానిధి, రత్నకుమారి, బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె నియోజకవర్గా సిహెచ్ఓలు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ వీరపాండ్యన్

రోగుల హెల్త్ ప్రొఫైల్ ఉండాలి

ప్రజాశక్తి - మద్దిపాడు

ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలు కచ్చితంగా నమోదై ఉండాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ అన్నారు. పిహెచ్‌సిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. పీహెచ్సీలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగుల ఆపా ఐడి కచ్చితంగా ఉండాలని సూచించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలంటే ఏమైనా మార్పులు చేర్పులు చేయాలా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట డిఎం అండ్ హెచ్ ఓ టి వెంకటేశ్వర్లు, డాక్టర్లు శ్రావణ్ కుమార్, ఆనందమోహన్, జగదీష్ బాబు, వినీల చౌదరి, హౌస్ సర్జన్స్, సిహెచ్వోలు రజిత కుమారి, లలితమ్మ, హెల్త్ సూపర్వైజర్ బాలకోటయ్య, ఇతర సిబ్బంది ఉన్నారు.

కార్మికులందరూ గుర్తింపు కార్డులు పొందాలి

బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి రమేష్ బాబు

ప్రజాశక్తి - చీరాల

ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు మేరకు కొత్తపేటలోని బాలా హ్యాండ్లూమ్స్ నందు కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరవ రమేష్ బాబు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు చట్టంలో కల్పించిన హక్కులను వినియోగించుకోవాలని కోరారు. కార్మికులందరూ కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఈ శ్రమ్ గుర్తింపు కార్డులను పొందాలని సూచించారు. 14ఏళ్లలోపు పిల్లలను కార్మికులుగా ఏ సంస్థ పెట్టుకో రాదని చెప్పారు. వారిని తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని కోరారు. న్యాయవాదుల సంఘం మహిళా ప్రతినిధి స్నేహలత మాట్లాడుతూ మహిళా కార్మికులు ప్రామిసరీ నోట్లు, చీటీ పాటలు వేసే సందర్భాల్లో ఖాళీ చెక్కులు ఇవ్వవద్దని, ఇస్తే వెనక్కి తీసుకోవాలని సూచించారు. అవసరమైన మహిళలు, వృద్ధులకు న్యాయ సేవాదికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. నియర్ న్యాయవాది ఎ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్మికులందరూ పని ప్రదేశాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలని అన్నారు. మహిళలకు అవసరమైన వైద్యం, మంచినీటి సదుపాయం ఖచ్చితంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అన్నారు. యాజమాన్యాలు సరైన కారణాలు చూపకుండా కార్మికులను తొలగించినప్పుడు, వారికి రావలసిన వేతనాలు తగ్గినప్పుడు హక్కుగా కోరే అవకాశం ఉందని తెలిపారు. కార్యదర్శి రవిబాబు, బాలా హ్యాండ్లూమ్ యజమాని ఆంజనేయులు, వీర రాఘవులు, ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బార్ ప్రెసిడెంట్ జి రమేష్

లాక్రోస్ పోటీల్లో సత్తా చాటిన ఫ్రైడ్ విద్యార్థులు

ప్రజాశక్తి- చీరాల

జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించడం తమ పాఠశాలకే గాక జిల్లాకు గర్వకారణమని ఫ్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ బి అశోక్ బాబు అన్నారు. జాతీయ స్థాయి లాక్రోస్ పోటీల్లో ఎపి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనపర్చారని అన్నారు. ఫలితంగా ఆంధ్రజట్టు తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. ఏప్రిల్ 29 నుంచి మే 1వరకు మూడు రోజుల పాటు ఆగ్రాలో జాతీయ స్థాయి లాక్రోస్ పోటీలు జరిగాయని అన్నారు. పోటీల్లో దేశంలోని 24 రాష్ట్రాల నుండి క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. పోటీల్లో మొదటి రెండు స్థానాల్లో రాజస్థాన్, హర్యానా జట్లు నిలిచినట్లు ఏపీ లాక్రోస్ సెక్రటరీ సురేంద్రబాబు తెలిపారు. గతేడాది పోటీల్లో ఆంధ్రజట్టు మొదటి స్థానంలో నిలిచిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ బాబు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో తమ విద్యారులు రాణించడం అబినందనీయమని అన్నారు. ఆంధ్రజట్టులో తమ విద్యార్థులు 10 మంది ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. ఆయా జట్లలో విశేష ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ జట్టుకు ఎంపిక చేసే క్రమంలో తమ విద్యార్థులు ఇద్దరు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.

జాతీయస్థాయి అవార్డు అందుకుంటున్న ఫ్రైడ్ విద్యార్థులు

పాఠశాలలో డిజిటల్ ప్యానల్ బోర్డు ధ్వంసం

ప్రజాశక్తి- సిఎస్పురం రూరల్

మండలంలోని శీలంవారిపల్లిలోని కెవి నర్సయ్య నగర్ జెడ్‌పి హై స్కూల్ ప్లస్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ ప్యానెల్ బోర్డును గుర్తుతెలియని దుండగు లు ధ్వంసం చేశారు. రూ.5లక్షల విలువైన ఐదు డిజిటల్ ప్యానల్ బోర్డులను ఐదు గదుల్లో ఏర్పాటు చేశారు. బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల్లోని 6వ తరగతి గది తలుపును తీసుకుని ఆ గదిలోని డిజిటల్ ప్యానెల్ బోర్డును బండరాయితో పగలగొట్టారు. పాఠశాల ఆవరణలో దాతలు ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలను గత నెల 23న ధ్వంసం చేసి ఉన్నారు. అప్పట్లో దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో మరోసారి దుండగులు ప్యానల్ బోర్డును పగలగొట్టారని గ్రామస్తులు అంటున్నారు.



ధ్వంసం చేసిన డిజిటల్ ప్యానెల్ బోర్డు, వాడిన బండరాయి

పోలీసులకు ఫిర్యాదు

పాఠశాల గదిలోని డిజిటల్ ప్యానెల్ బోర్డును పగలగొట్టిన విషయంపై హెచ్ఎం తిరుపతయ్య, ఎస్ఎంసి చైర్మన్ మొరం మస్తానయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగులపై చర్యలు తీసుకుని విలువైన రికార్డులకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సహాయం అందజేస్తున్న హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు

వృద్ధునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యద్దనపూడి

హెల్పింగ్ హాండ్స్ సంస్థ స్థాపించి ఏడాదైన సందర్భంగా మండలంలోని అనంతవరంలో 75ఏళ్ల వృద్ధుడైన పోపూరి కృష్ణమూర్తి వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. సంస్థ అధ్యక్షులు పఠాన్ ఖాదరవలి, షేక్ భాషా (కేబుల్), పుట్టా అయ్యప్ప స్వామి, జాస్తి సాంబశివరావు, పాల చౌదరి, ఎం జనార్ధనరావు, షేక్ హబీబా, బొల్లపల్లి పౌలు పాస్టర్, బెన్ని బాబు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారి జయంతి

ప్రజాశక్తి - అద్దంకి

శ్రీ చక్ర సహితం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి పట్టణంలోని అమ్మవారి దేవస్థానంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణతో పాటు అన్నదానం నిర్వహించారు. ఊటుకూరి రామ కోటేశ్వరరావు, చింది లక్ష్మీ శ్రీనివాసరావు, అరవపల్లి హనుమంతరావు, కోశాధికారి నేరెళ్ల శ్రీనివాస రావు, కోకూరు వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్చూరు : వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ వేష ధారణలతో మహిళా భక్తుల 102 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కళాకారులు ప్రదర్శించిన నృత్యం అలరించాయి. శ్రీరామ్ వెంకట సుబ్బారావు, నంబూరి వెంకటరమణ, వై వెంకట సుబ్బారావు. పూర్ణచంద్రరావు, పల్లపోతు రాఘవయ్య, తవ్వా భావనారాయణ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - రేపల్లె

ఎంపిడిఒ కె శోభారాణి

విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు మెగా డిఎస్సి క్రాష్ కోర్స్ ఉచిత శిక్షణ విజయవాడలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె శోభారాణి తెలిపారు. దృష్టి లోపం, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ మొదలగు విభిన్న ప్రతిభావంతులైన ఎస్జిటి ఉపాధ్యాయ పోస్టులకు అర్హత గల అభ్యర్థులకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ సక్తి కలిగిన అభ్యర్థుల నుండి ఈ నెల 11వరకు ధరకాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా mdfc.apcfss.in వెబ్సైటును సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కనీసం 40శాతం వైకల్యం ఉన్న వారు మాత్రమే అర్హులని తెలిపారు. శిక్షణకు టెట్ స్కోర్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక బోధనా పద్ధతుల్లో శిక్షణ, స్టడీ మెటీరియల్, ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ విలువైన అవకాశాన్ని విభిన్న ప్రతిభావంతులైన డిఎస్సి అభ్యర్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును మెరుగుపర్చుకోవాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి - బట్టిప్రోలు

ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ఈ ఏడాది 1వ తరగతిలో చేర్చే విద్యార్థులకు 25శాతం సీట్లు ఉచితంగా ఇవ్వనన్న దృష్ట్యా దానికి గాను నిరుపేద విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, ఎంఈఓ2 నీలం దేవరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి 2020 జూన్ నెలకు ముందు జన్మించి ఉండాలని తెలిపారు. 25 శాతానికి మించి దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 15లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఉగ్రవాదాన్ని అంతం చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

ఉగ్రవాదాన్ని అంతం చేయడమే ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యమని జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ అన్నారు. పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరిట చేసిన దాడులు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. తమ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ జోసఫ్ కుమార్

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ఉపాధి హామీ పథకం పనులలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పిడి కె జోసఫ్ కుమార్ అన్నారు. ఆనికాలపల్లి, నల్లమడు గుల గ్రామాల పరిధిలో ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఊట కుంటల నిర్మాణం, పశువుల నీటితోల్లు, కూలీల హాజరు పరిశీలించారు. రావులయ్య కుంట, గుడి ప్రాంతంలో గంప చెట్లు తొలగించి, కట్టను వెడల్పు చేసి మొక్కలు పెంచే పనులు, సిఎస్పురం చెరువు ప్రాంతంలో ఫిష్ పాండ్ ఏర్పాటు చేసి చేప పిల్లలను పెంచే అవకాశాన్ని, సిఎస్పురం, పామూరు మండలాల పరిధిలో 400 ఎకరాల్లో నిమ్మ, బత్తాయి, దానిమ్మ ఉద్యాన వన పంటలు సాగు చేయనున్నట్టు తెలిపారు. పనులు కల్పించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎపిఎం వల్లపు శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

ఆర్‌బిఎస్‌కె సేవలను వినియోగించుకోండి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- జిజిహెచ్‌లో ఎక్స్‌రే యూనిట్ ప్రారంభం

వైద్యపరికరాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) ద్వారా పిల్లలకు ఏ చికిత్స అయినా ఉచితమని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జిల్లా బాల భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ పోర్టబుల్ ఎక్స్ రే యూనిట్, పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల స్మైల్ ట్రైన్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న గ్రహణ మొర్రి, పెదవి చీలిక, అంగటి చీలిక టెస్ట్ స్క్రీనింగ్ క్యాంపెయిన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రహణ మొర్రి, పెదవి చీలిక, అంగటి చీలిక కలిగిన పిల్లల తల్లిదండ్రులతో కలెక్టర్ మాట్లాడి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హ్యాండ్ పోర్టబుల్ ఎక్స్‌రే యూనిట్ పని చేసే విధానాన్ని కలెక్టర్ పరిశీలన చేసి.. వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె)లో జిల్లాలో గ్రహణ మొర్రి, పెదవి చీలిక, అంగటి చీలిక కలిగిన 30 మంది పిల్లలను గుర్తించామన్నారు. వీరికి పిన్నమినేని సిద్ధార్థ వైద్య కళాశాల స్మైల్ ట్రైన్ ఫౌండేషన్ సహకారంతో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఈ రోజు జిజిహెచ్‌లో టెస్ట్ స్క్రీనింగ్ క్యాంపెయిన్‌ను నిర్వహించామన్నారు. వీరందరికీ ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ డెర్మటో సర్జరీ యూనిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, డిప్యూటీ సూపరింటెండెంట్లు కిరణ్‌కుమార్, బాలాజీనాయక్, క్లెఫ్ట్ ప్రాజెక్ట్ స్మైల్ ట్రైన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్, సిద్దార్థ డెంటల్ కళాశాలకు చెందిన డాక్టర్ సుధా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం

వేలం కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యేలు దామచర్ల, బిఎన్

వేలం కేంద్రంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు దామచర్ల, బిఎన్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం పొగాకు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు స్పష్టం చేశారు. సంతనూతలపాడు శాసన సభ్యులు బిఎన్ విజయ్ కుమార్ తో కలిసి గురువారం త్రోవగుంట వద్ద ఉన్న ఒంగోలు రెండవ వేలం కేంద్రాన్ని సందర్శించారు. వేలానికి ఉంచిన పొగాకు బేళ్లను పరిశీలించారు. పొగాకు రైతులు, అధికారులతో ఎమ్మెల్యేలు మాట్లాడారు. అనంతరం రైతు సంఘాల నాయకులతో ఎమ్మెల్యేలుమాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది పొగాకు పంట బాగా రావడం, గిట్టుబాటు ధర ఉండటంతో ఈ ఏడాది రైతులు కొంత ఎక్కువ పండించారని తెలిపారు. ఖర్చులు కూడా పెరగటంతో రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పొగాకు రైతులను ఆదుకుంటుందన్నారు. గతంలో పొగాకు ధరలు లేకపోవటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కిలోకు రూ.5లు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. పొగాకు కొనుగోళ్ళలో ఐటిసి కంపెనీ గుత్తాధిపత్యం చెలాయిస్తుందని, ఇతర కంపెనీలు రాకుండా చూస్తుందన్నారు. కర్ణాటకలో రైతులు పండించిన అదనపు పొగాకుకు కర్ణాటకలో ఎలాంటి పెనాల్టీలు వేయటం లేదని, ఈ విషయాన్ని ప్రభుత్వం ద్వారా పొగాకు బోర్డు దృష్టికి తీసుకెళతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని కంపెనీలు వేలంలో పాల్గొనే విషయమై ఈనెల 12 వ తేదీ జరగనున్న జిల్లా సమీక్షా సమావేశంలో మాట్లాడనున్నట్లు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ప్రజాప్రతినిధులంతా కలిసి పొగాకు వ్యాపారులతో మాట్లాడి రైతులకు మద్దతు ధర వచ్చేలా చూస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు హామీ ఇచ్చారు. పొగాకు రైతులకు నష్టం జరగకుండా గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు, వేలం కేంద్రం సూపరింటెండెంట్ తులసి, తెలుగు రైతు నాయకుడు పోలవరపు వెంకట్రామయ్య, రైతు సంఘం నాయకులు కెవివి ప్రసాద్, హనుమారెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

రవికుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శింగరాయకొండ నాయకులు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డిని గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సస్పెన్షన్ చేశారు. ఈ సస్పెన్షన్‌ను బుధవారం నాడు ఎత్తివేస్తున్నట్లు పార్టీ కేంద్ర కమిటీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. దీంతో వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మాజీ మంత్రి కొండేపి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆదిమూలపు సురేష్‌కు, పార్లమెంటు అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కం రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షులు దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

విపత్కర పరిస్థితుల్లో

ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి

- అండగా జిల్లా యంత్రాంగం సన్నద్ధం..
- ఎస్పీ తుషార్ డూడి

మాక్‌డ్రిల్‌లో భాగంగా క్షతగాత్రులను తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భారత్, పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్నందున సంక్షోభ సమయంలో పౌరులు తమను తాము ఏవిధంగా కాపాడుకోవాలో అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బుధవారం నాడు కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి సూర్యలంకలో జిల్లా అధికారులకు మాక్ డ్రిల్ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. వారి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ సారథ్యంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సంయుక్తంగా బాపట్ల పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్‌లో భాగంగా రైల్వే స్టేషన్‌లో అగంతకులు దాడులకు పాల్పడుతున్నారనే సమాచారంతో పోలీస్ యంత్రాంగం, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది రైల్వేస్టేషన్‌కు చేరుకొని తనిఖీలు నిర్వహించారు. ఆగంతుకుల దాడులలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. దాడులు జరిగే సమయంలో ప్రయాణికులను అప్రమత్తం చేసి సురక్షితమైన ప్రదేశాలకు తరలించారు. దాడులు జరిగే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించు విధానంపై ప్రయాణికులకు తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, ఆర్డీవో గ్లోరియా, డిఎస్‌వో విలియమ్స్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి మాధవనాయుడు, బాపట్ల పట్టణ ఇన్స్పెక్టర్ రాంబాబు, రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు మౌలుద్దీన్, శ్రీకాంత్, రైల్వే, వైద్య, అగ్నిమాపక ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

విపత్తు నిర్వహణపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు తగిన సూచనలు చేశారు. బుధవారం కలెక్టర్ సూర్యలంకలోని ఎయిర్ బేస్ స్టేషన్ లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం పాకిస్తాన్ లోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసిన నేపథ్యంలో రాబోయే విపత్తు పై తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు సూచనలు చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి తుషార్ డూడి, సూర్యలంక ఎయిర్ బెస్ స్టేషన్ సెక్షన్ ఆఫీసర్ రాబోయే విపత్తు గురించి సమాలోచన చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు ఎరువులు అందించండి: జేసీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రైతులకు తక్కువ ధరలకు ఎరువులు అందించాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ సమాఖ్య అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్, ఒంగోలు కార్యాలయంలో గురువారం వ్యాపార కార్యకలాపాలపై జెసి, సమాఖ్య పర్సన్ ఇన్‌చార్జి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సమాఖ్య ఎరువుల కొనుగోళ్లు, అమ్మకాలు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా జరిగిన ధాన్యం సేకరణపై సమీక్ష జరిపారు. సమాఖ్య పురోభివద్ధికి తీసుకొనవలసి చర్యలపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సమాఖ్యలో సభ్యుల సంఖ్యను పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో సమాఖ్య ప్రధాన కార్యాలయ సిబ్బంది, అన్ని బ్రాంచిల ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు.

మన్యం వీరుడి స్ఫూర్తితో ముందుకు..

'అల్లూరి'కి ఘన నివాళి

అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాపట్ల కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మన్యం వీరుడు, స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా తెలిపారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఒంగోలు ఏ1 ఫంక్షన్ హాలు వద్ద ఉన్న అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి కలెక్టర్, ఒంగోలు, సంతనూతలపాడు శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు, బిఎన్.విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, పలు సంఘాల నేతలు, జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారికి ఎదురునిలిచి.. 27 సంవత్సరాల వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన యోధుడు అల్లూరి అని కొనియాడారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్.విజయకుమార్ మాట్లాడుతూ అడవి బిడ్డల హక్కుల కోసం పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుని స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారికి ధైర్యంగా ఎదురొడ్డి వీరోచితంగా ప్రాణాలు విడిచిన మహానాయకుడు అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి అంజల, స్టెప్ సిఇఒ శ్రీమన్నారాయణ, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

'అల్లూరి'కి ఘన నివాళి

బాపట్ల జిల్లా: స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ జె.వెంకట మురళి, జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్‌గౌడ్, తదితరులు పూలమాల వేసి.. నివాళులర్పించారు.

'అల్లూరి' జీవితం ఆదర్శం..

అల్లూరి సీతారామరాజు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి విఠలేశ్వర్, ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.